క్లుప్తంగా

నిషేధిత గడ్డిమందు స్వాధీనం



కొత్తపల్లి: రాష్ట్రంలో నిషేధిత గ్లైఫోసెట్ గడ్డి మందును అక్రమంగా తరలిస్తుండగా పట్టుకున్నట్లు అధికారులు తెలిపారు. భూనీడు గ్రామానికి చెందిన బాలకృష్ణ నాయుడు అనే వ్యక్తి బైక్‌పై నిషేధిత గడ్డి మందు బాటిళ్లను తరలిస్తుండగా మండల వ్యవసాయ అధికారి రమేశ్ దాడి చేసి పట్టుకున్నారు. స్వాధీనం చేసుకున్న మందు బాటిళ్లను మద్దూరు పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అలాగే వ్యవసాయ అధికారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ విజయ్ కుమార్ తెలిపారు.

సమయపాలన పాటించాలి

మానవపాడు: అంగన్‌వాడీ సెంటర్లలో సమయపాలన తప్పక పాటించాలని ఐసీడీఎస్ సీడీపీఓ సుజాత సూచించారు. శనివారం మండల కేంద్రంలో మానవపాడు పరిధిలోని అంగన్‌వాడీ టీచర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో నిత్యం అందరికి అందుబాటులో ఉండి సేవలందించాలన్నారు. గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. బరువు తక్కువ ఉన్న పిల్లలను గుర్తించి హెల్త్ చెకప్ చేయించాలని ఆదేశించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ లక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

మొహర్రం ప్రారంభం



మద్దూరు: మండలంలో పీర్లు కొలువుదీరాయి. నెలవంక కనిపించడంతో గ్రామాల్లోని పీర్ల చావిడిలో పీర్లను కొలువుదీర్చారు. మండల కేంద్రంలో దాదాపు 10 చోట్ల పీర్లను ఏర్పాటు చేశారు. మంగళవారం రాత్రి సవారీ, బుధవారం రాత్రి అబ్బసలీ, గురువారం రాత్రి కాశీంసావ్, శుక్రవారం భారయిమామ్, శనివారం హుసేన్‌సావ్ సవారీలు, ఆదివారం నిమజ్జనానికి తరలనున్నట్లు ఆయా పీర్ల కమిటీ సభ్యులు తెలిపారు.

శ్మశాన వాటిక స్థలాన్ని రక్షించాలి

ఊట్కూరు: పట్టణంలోని ఊట్కూరు చెరువు పక్కన గల శ్మశాన వాటికను పరిరక్షించాలని మైనార్టీలు కోరారు. ఈ మేరకు శనివారం తహసీల్దార్ చింతరవికి వినతిపత్రం అందజేశారు. నారాయణపేట, కొడంగల్ ఎత్తిపోతల పథకంలో భాగంగా ఊట్కూరు పెద్ద చెరువును రిజర్వాయర్‌గా మారుస్తుండడంతో ఖబ్రస్తాన్, రోషనల్లీతాతా దర్గా నీటిలో మునిగిపోయే ప్రమాదం ఉందన్నారు. అధికారులు స్పందించి సర్వేలో శ్మశాన వాటికను మినహాయింపు ఇవ్వాలని లేకపోతే శ్మశాన వాటికకు భూమి కొనుగోలు చేసి ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో మహమ్మద్ ఇస్మాయిల్, పాషా, నాసీర్‌ఖాన్, కుద్దూస్, షమీ, ఇబాదూర్ రహమాన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఊట్కూరు: మండలంలోని ఊట్కూరు, కొల్లూరు, నాగిరెడ్డిపల్లి, సమస్తాపూర్ గ్రామాల్లో ఆదివారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. వర్షాకాలం కావడంతో ఆయా గ్రామాలలో ట్రీ కట్టింగ్ చేపట్టనుండడంతో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు తెలిపారు. వినియోగదారులు గమనించాలని కోరారు.

ఇసుక టిప్పర్ పట్టివేత

మరికల్: అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ఓ టిప్పర్‌ను పోలీసులు పట్టుకున్నారు. రాకొండకు చెందిన నాగరాజు కొన్నాళ్ల నుంచి రాకొండ, మాగనూర్ వాగుల నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్నాడు. ఈ విషయం తెలుసుకున్న టాస్క్‌ఫోర్స్, మరికల్ పోలీసులు దాడి చేసి టిప్పర్‌ను పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. డ్రైవర్ ప్రకాశ్, యాజమాని నాగరాజుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రాము తెలిపారు.

కేసు నమోదు

ధన్వాడ: ధన్వాడ పోలీస్ స్టేషన్ పరిధిలో అర్ధరాత్రి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న టిప్పర్‌ను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రాజశేఖర్ తెలిపారు. ఎలాంటి అనుమతులు లేకుండా షేర్నపల్లి గ్రామానికి చెందిన డ్రైవర్ నరేందర్, యజమాని వెంకటేశ్‌లు టిప్పర్‌లో ఇసుకను తరలిస్తున్నట్లు తెలియడంతో దాడి చేసి వారిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

మొద్దునిద్రలో తూనికలు.. కొలతల శాఖ



ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న ఎస్‌ఐ, వ్యవసాయ అధికారులు (ఫైల్)



కర్ణాటక నుంచి తెచ్చిన డిజీల్ విక్రయిస్తూ పట్టుబడ్డ వాహనం (ఫైల్)

- కర్ణాటక నుంచి నాణ్యత లేని సరుకుల దిగుమతి
- నిలువునా మోసం చేస్తున్న వ్యాపారులు
- నష్టపోతున్న వినియోగదారులు

కృష్ణా: ఉమ్మడి కృష్ణా మండలంలో మొత్తం 47,850 మంది జనాభా నివసిస్తున్నారు. మొత్తం 31 గ్రామాల్లో నిత్యం రూ.లక్షల్లో కొనుగోళ్లు జరుగుతున్నాయి. అయితే దుకాణాల్లో అక్రమాలకు అడ్డుకట్ట వేయాల్సిన తూనికలు, కొలతల శాఖ మొద్దు నిద్ర పోతుంది. నిత్యావసర సరుకుల నుంచి మొదలు అన్నింటిలోనూ భారీ స్థాయిలో లోటుపాట్లు జరుగుతున్నాయని వినియోగదారులు ఓవైపు గగ్గోలు పెడుతున్నా అవేమీ మాకు కనిపించడం లేదన్నట్లుగా అధికారులు ప్రవర్తిస్తున్నారు. మండలంలో పెట్రోలు బంకులు, రైస్ మిల్లులు, కిరాణం దుకాణాలు, ప్యాకింగ్ చేసిన వస్తువులు, ఎలక్ట్రానిక్ వేయింగ్ మిషన్లు, కౌంటర్ సేల్స్ వంటి వాటిని తూనికలు, కొలతల శాఖ అధికారులు మానిటరింగ్ చేస్తూ వినియోగదారులకు చేరుతున్నాయో లేదో తెలుసుకోవడం లేదు. ఎలాంటి కార్యాచరణ లేకుండా తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. రోజూ తూకాల్లో, నాణ్యతల్లో రూ.లక్షల్లో చేతులు మారుతున్నా తూనికల, కొలతల శాఖ అధికారులు చోద్యం చూస్తున్నారు. భారీగా నష్టపోతున్న వినియోగదారుల గురించి ఏమాత్రం పట్టించుకోవడం లేదు. దుకాణాదారులతో అధికారులు చేతులు కలిపి, నెల నెల ముడుపులకు అలవాటుపడడమే కారణమని బాధితులు వాపోతున్నారు.

అధికారుల అండతో జోరుగా అక్రమ వ్యాపారం

మండల సరిహద్దులోని సైదాపూర్ పట్టణం నుంచి ట్యాక్స్ కట్టని సరుకులు, నాణ్యత లేని వాటిని నిరంతరం మక్తల్ నియోజకవర్గంలోని పలు ప్రాంతాలకు తరలిస్తుంటారు. వీటిని నియంత్రించాల్సిన అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపణలున్నాయి. అదే విధంగా డీజిల్ ధరలు కర్ణాటకలో తక్కువగా ఉండడంతో అక్రమార్కులు మినీ ట్యాంకుల ద్వారా డీజిల్‌ను తెలంగాణలోని పలు వ్యాపార సముదాయాలకు సరఫరా చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఈ విషయం అన్ని శాఖల అధికారులకు తెలిసే ఈ అక్రమ వ్యాపారం కొనసాగుతున్నట్లు ఆరోపణలున్నాయి.

వీటిపై ఫిర్యాదు చేయొచ్చు

⇨ పెట్రోల్ బంకుల్లో డీజిల్, పెట్రోలు కొలతల్లో తేడాలుంటే తూనికలు–కొలతలు శాఖ ముద్రవేసిన 5 లీటర్ల కొలత పాత్రలతో సరిచూసుకోవాలి.

⇨ కొనుగోలు చేసే ప్రతి ప్యాకేజీపై అమ్మకందారుని చిరునామా, తూకం, కొలత, నాణ్యత అందులో కలిపిన వస్తువులు, ఎంఆర్‌పీ, వినియోగదారుల సేవా ఫోన్ నంబరు, సంస్థ నంబర్లు తప్పనిసరిగా ఉండాలి. లేదంటే ఫిర్యాదు చేయొచ్చు.

⇨ ఎలక్ట్రానిక్ బరువు చూసే యంత్రాల్లో మొదట సున్నా రీడింగ్ ఉందో లేదో గుర్తించాలి.

⇨ నిత్యావసరాల దుకాణాల్లో వస్తువులను తూకం వేసే త్రాసుల్లో ఏ మాత్రం తేడా ఉన్నట్లు గమనించినా ఫిర్యాదు చేయొచ్చు.

⇨ కౌంటర్ సేల్స్‌లో పదార్థాలను తూచేటప్పుడు ముళ్లు సమాంతరంగా ఉన్నాయా..? లేదా..? అనేది గమనించాలి.

⇨ తూనికల విషయంలో ప్రతి తూనిక కింద లీగల్ మెట్రాలజీ అధికారులతో 'ధ్రువీకరించబడింది' అనే ముద్ర ఉండాలి.

⇨ఎంఆర్‌పీ ధరకు మించి ఎక్కడా ఎక్కువ ధరకు వస్తువులను విక్రయించకూడదు. ఒకవేళ విక్రయిస్తే సదరు వ్యక్తి లేదా దుకాణం నుంచి బిల్లు తీసుకొని ఫిర్యాదు చేసి నష్టపరిహారం రాబట్టవచ్చు.

ఏడాదికి ఒకసారైనా తనిఖీలు చేపట్టాలి



తూనికల, కొలతల శాఖ అధికారులు దుకాణాల్లో ఏడాదికి ఒకసారైనా తనిఖీలు చేపట్టి వినియోగదారులకు న్యాయం చేయాలి. కానీ తూనికల శాఖ అధికారులు దాడులు చేస్తున్నట్లు ఎక్కడా కనిపించడం లేదు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా తనిఖీలు జరగకపోవడంతో వ్యాపారులు వినియోగదారులను నిలువునా మోసం చేస్తున్నారు.

–వై క్రిష్ణ, ముడుమాల్ గ్రామం

నాణ్యత లేని సరుకులను నియంత్రించాలి



కర్ణాటక నుంచి తెలంగాణ ప్రాంతంలోకి నాణ్యత లేని నిత్యావసర సరుకుల రవాణాను అధికారులు అరికట్టాలి. మా ప్రాంతం సరిహద్దులో ఉండడంతో కల్తీ సరకులను ఈ ప్రాంతంలోని వ్యాపారులు తక్కువ ధరలకు తీసుకొచ్చి విక్రయిస్తుంటారు. వీటన్నింటిపై అధికారులు తగు చర్యలు తీసుకోవాలి.

–శివప్ప, గుడెబల్లూర్ గ్రామం

⇨ వినియోగదారుల నుంచి ఏ క్షణం ఫిర్యాదు అందినా తక్షణం స్పందించి తనిఖీ నిర్వహించాలి. నిబంధనలకు వ్యతిరేకంగా అమ్మకాలు జరుగుతుంటే వారిపై చర్యలు తీసుకోవాలి కానీ అధికారులు మాత్రం తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



మక్తల్: పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర పశుసంవర్ధక , మత్స్య, డెయిరీ, క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. శనివారం మక్తల్‌లో వ్యవసాయ శాఖ ఆధ్వర్యలలో రైతులకు ఆయన ఉచితంగా కంది విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజల మేలును ఎప్పుడు మరువలేనన్నారు. మరిన్ని నిధులు తీసుకొచ్చి అభివృద్ధిని పరుగులు పెట్టిస్తానన్నారు. రైతులకు ఇప్పటి వరకు రూ.వేల కోట్ల రుణమాఫీ చేశామన్నారు. అలాగే గతేడాది రూ.32 కోట్ల బోనస్ మంజూరు చేసినట్లు పేర్కొన్నారు.

అభివృద్ధికి నిధులు కేటాయించండి

జిల్లా సమగ్ర అభివృద్ధికి అధిక నిధులు కేటాయించాలని సీపీఎం జిల్లా నాయకులు కోరారు. ఈ మేరకు శనివారం మంత్రి వాకిటి శ్రీహరిని కలిసి వినతిపత్రం అందజేశారు. అలాగే మక్తల్ –కొడంగల్–నారాయణపేట ఎత్తిపోతల పథకం కింద భూములు కోల్పోతున్న రైతులకు న్యాయం చేయాలని కోరారు. 2013 చట్టప్రకారం అదనంగా మూడు రెట్లు కలిపి ఇచ్చి ప్రాజెక్టు పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. అనంతరం మంత్రికి భగత్‌సింగ్ జీవిత చరిత్ర పుస్తకాన్ని అందజేశారు. కార్యక్రమంలో గోపాల్, అంజయ్య, అంజనేయులు, గోవిందు, భారత్, నర్సింహ, మహేష్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

క్రీడాకారిణులను అభినందించిన మంత్రి

మక్తల్‌కు చెందిన క్రీడాకారిణులు రూప, దీప, శిల్ప, పుష్పలను మంత్రి వాకిటి శ్రీహరి అభినందించారు. రిటైర్డు పీఈటీ గోపాలం నలుగురు కూమార్తెలు వివిధ క్రీడల్లో ప్రతిభ చాటడడంతో తన నివాసంలో వారిని అభినందించి మక్తల్‌కు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ కోళ్ల వెంకటేశ్, కావాలి ఆంజనేయులు పాల్గొన్నారు.

గిరిజనుల అభ్యున్నతికి పెద్దపీట

కోస్గి రూరల్: గిరిజనుల అభ్యున్నతికి పెద్దపీట వేస్తున్నామని జిల్లా గిరిజన ఆభివృద్ధి అధికారి జనార్ధన్ అన్నారు. శనివారం గుండుమాల్ మండల పరిధిలోని అప్పాయపల్లి గ్రామంలో గ్రామపంచాయతీ కార్యాలయంలో కేంద్రప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ పీఎం దర్తి అబాజన్ జాతీయ గ్రామ్ ఉత్కర్ష్ అభియాన్ పథకం క్రింద జిల్లాలో 6 గిరిజన గ్రామాలను ఎంపిక చేసినట్లు తెలిపారు. ఇందులో భాగంగా జిల్లా గిరిజన మంత్రిత్వశాఖ , కేంద్రం ద్వారా ప్రకటించబడిన పథకాలు, ఆధార్ కార్డు , ఆహర భద్రత కార్డు, ఆయుస్మాన్ భారత కార్డు , కిసాన్ క్రెడిట్ కార్డు , జన్‌ధన్ బ్యాంకు అకౌంట్ మొదలైన పథకాలపై అవగాహన కల్పించారు.



మాట్లాడుతున్న జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి జనార్ధన్

కార్యక్రమంలో జిల్లా సహయ గిరిజన అభివృద్ధి అధికారి చిన్యానాయక్ , వసతి గృహ సంక్షేమ అధికారి రాజేందర్ వివిద శాఖల అధికారులు పాల్గొన్నారు.

వ్యాపారస్తులకు ట్రేడ్ లైసెన్స్ తప్పనిసరి



లైసెన్స్‌లను జారీ చేస్తున్న అనిల్‌కుమార్

కోస్గి : వ్యాపార సంస్థల యజమానులు మున్సిపల్ ద్వారా ట్రేడ్ లైసెన్స్ తప్పనిసరిగా తీసుకోవాలని మున్సిపల్ మేనేజర్ అనిల్‌కుమార్ అన్నారు. శనివారం 100 రోజుల కార్యాచరణలో భాగంగా మున్సిపల్ కార్యాలయం నుంచి శివాజీ చౌరస్తా వరకు మున్సిపల్ కార్మికులు, అధికారులతో కలిసి ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా పలు వ్యాపార సముదాయాలకు నూతన ట్రేడ్ లైసెన్స్‌లను జారీ, రెన్యూవల్ చేశారు. అలాగే తడి, పొడి చెత్తపై ప్రజలకు అవగాహన కల్పించి ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. హెల్త్ అసిస్టెంట్ మోహిన్‌బాషా, మున్సిపల్ అధికారులు, మెప్మా సిబ్బంది, కార్మికులు ఉన్నారు.

బస్సు సర్వీస్‌ను పునరుద్ధరించండి



రాజుపల్లి నుంచి నర్వకు కాలినడకన వెళ్తున్న విద్యార్థులు

నర్వ: రాజుపల్లి–రాయికోడ్ గ్రామాల మధ్య బస్సును పునరుద్ధరించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. నిత్యం తమ గ్రామం నుంచి పదుల సంఖ్యలో విద్యార్థులు నర్వ, పాథర్చేడ్ గ్రామాల్లోని పాఠశాలలకు వెళ్తుంటారని అయితే రాజుపల్లి–రాయికోడ్ వెళ్లే బస్సును గత కొన్ని రోజులుగా నిలిపేయడంతో విద్యార్థులు పాఠశాలలకు నడిచి వెళ్లాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. మండల కేంద్రానికి రానుపోను 8 కిలోమీటర్లు ఉండడంతో విద్యార్థులు నడుచుకుంటూ ఇంటికి తిరిగొచ్చేందుకు తీవ్ర అవస్థలు పడుతున్నారన్నారు. అధికారులు స్పందించి బస్సును పునరుద్ధరిస్తే విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు.

పచ్చని చెట్లతోనే ప్రకృతికి ప్రాణం

కొత్తపల్లి: మండల పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో భూనీడులో ఏకో గ్రీన్ క్లబ్ ఆధ్వర్యంలో 50 మొక్కలు నాటారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు కేశవ రెడ్డి మాట్లాడుతూ ప్రకృతికి ప్రాణాదారం చెట్లేనని, ప్రాణవాయువును అందించే చెట్లను పెంచాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ప్రకృతిని కాపాడడంలో భాగంగా తమ పాఠశాలలో మొక్కలు కార్యక్రమంలో ఉపాధ్యాయులు భానుప్రకాశ్ రెడ్డి, కే శ్రీలత, శివాజీ, అహమద్ అలీ, వనజ, సుజాత, నరేశ్, శ్రీనివాస్ విద్యార్థులు పాల్గొన్నారు.



భూనీడు పాఠశాలలో మొక్కలు నాటుతున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

మెనూ ప్రకారం భోజనం అందించాలి

కొత్తపల్లి: విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని ఎంఈఓ రమేశ్ సూచించారు. మండల పరిధిలో తిమ్మారెడ్డి పల్లి ప్రాథమికోన్నత పాఠశాలను శుక్రవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించి వంట మహిళలకు పలు సూచనలు చేశారు. పాఠశాల పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అలాగే తాజా కూరగాయలతోనే వంట చేయాలని, నాణ్యమైన భోజనం వడ్డించాలని సూచించారు.



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎంఈఓ రమేశ్

అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.

దరఖాస్తుల ఆహ్వానం

కృష్ణా: మండలంలోని కస్తూర్బా బాలికల పాఠశాలలో ఒక హెడ్‌కుక్, నాలుగు అసిస్టెంట్ కుక్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంఈఓ నిజాముద్దీన్ శనివారం ఒక ప్రటనలో తెలిపారు. ప్రధానంగా దరఖాస్తులు చేసుకునేవారు స్థానికులై ఉండాలని, 18 నుంచి 35 ఏళ్ల వయస్సు ఉన్న వారు అర్హులన్నారు. అలాగే హెడ్‌కుక్‌కు 10వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలని, వంటలు చేసిన అనుభవం ఉండాలని సూచించారు. అసిస్టెంట్ కుక్‌కు ఏడో తరతగతి ఉత్తీర్ణులై ఉండాలన్నారు. ఆసక్తి గల వారు ఈ నెల 30 నుంచి వచ్చే నెల 4 వరకు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ



మాగనూర్: మండలంలోని బైరంపల్లి గ్రామంలో శనివారం గృహ నిర్మాణశాఖ ఏఈ అంజి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులకు పూజలు నిర్వహించి నిర్మాణాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదలకు అండగా ఉండడమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. ఇందులో పంచాయతీ కార్యదర్శి రాములు, కాంగ్రెస్ అధ్యక్షుడు ఆనంద్, అంపన్న తదితరులు పాల్గొన్నారు.

గురుకులంలో డిజిటల్ విద్యాబోధన



ధన్వాడ: మండలంలోని కొండాపూర్ గ్రామంలో గల తెలంగాణ గిరిజన గురుకుల పాఠశాలలో విద్యార్థులకు డిజిటల్ పాఠాలు బోధించేందుకు వీలుగా స్మార్ట్ టీవీలను ఏర్పాటు చేసినట్లు ప్రిన్సిపల్ రాజారాం తెలిపారు. శనివారం ఐదో తరగతి విద్యార్థులతో కలిసి వీటిని ప్రారంభించారు. విద్యార్థులకు మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా సులభంగా పాఠాలు అర్థం చేసుకునేందుకు వీలుగా స్మార్ట్ టీవీల ద్వారా పాఠాలు బోధించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ ఎం శ్రీనివాసులు, జూనియర్ వైస్ ప్రిన్సిపల్ సాంబయ్యనాయక్, లక్ష్మయ్య, నరసింహులు, పురుషోత్తం, సాయిబాబా, శ్రీనాథ్ పాల్గొన్నారు.

విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచాలి

నర్వ: మండలంలోని అన్ని పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని మెనూ ప్రకారం అందించాలని ఎంఈఓ రాంరెడ్డి అన్ని పాఠశాలల హెచ్‌ఎంలకు సూచించారు. ఎంఈఓ అన్ని పాఠశాలల హెచ్‌ఎంలతో శనివారం ఎంఆర్సీలో రివ్యూ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అన్ని పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని మెనూ ప్రకారం అందించాలని, ఉచిత యూనిఫామ్స్, పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్‌ను విద్యార్థులకు పూర్తిస్థాయిలో అందించాలన్నారు. బోధనా సామర్థ్యాలను పెంపొందించాలన్నారు. విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచాలన్నారు. హెచ్‌ఎంలు, కృష్ణయ్య, నవీన్, రాఘవరెడ్డి, వెంకటేశ్, ఉస్మాన్, సీఆర్పీ నర్సింములు పాల్గొన్నారు.

సమాజ సేవకు గుర్తింపుగా డాక్టరేట్ ప్రదానం

నర్వ: సామాజిక సేవే పరమావధిగా నిబద్ధతో పని చేసిన నర్వ శ్రీమంతుడు బంగ్లా లక్ష్మీకాంత్‌రెడ్డి శనివారం చెన్నైలోని మైలాపూర్‌లో డాక్టరేట్ పట్టా అందుకున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో విద్య, ఆరోగ్యం, తాగునీరు అందించేందుకు ఆయన ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ క్రమంలో తమిళనాడుకు చెందిన గ్లోబల్ హ్యూమన్‌పీస్ ఇంటర్‌నేషనల్ యూనివర్సిటీ వారు శనివారం వైస్ చాన్స్‌లర్ డా.వెంకటేశ్ చేతుల మీదుగా డాక్టరేట్ పట్టా అందించారు. ఈ సందర్భంగా లక్ష్మీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ డాక్టరేట్ అందుకోవడం సంతోషంగా ఉందని, ఇప్పటి నుంచి మరింత బాధ్యతాయుతంగా సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తానన్నారు.



డాక్టరేట్ అందుకుంటున్న బంగ్లా లక్ష్మీకాంత్‌రెడ్డి

సేవా కార్యక్రమాలను మరింతగా విస్తృతం చేస్తానని పేర్కొన్నారు.

తిమ్మయ్యకు డాక్టరేట్ అందజేత

కృష్ణా: మండలంలోని ముడుమాల్ గ్రామానికి చెందిన బీటీఎం ఫౌండేషన్ వ్యవస్థాపకుడైన తిమ్మయ్యకు శనివారం తమిళనాడులోని 'గ్లోబల్ హుామెన్ పీస్ ఇంటర్నేషనల్ యూనివర్సిటీ' డాక్టరేట్‌ను అందజేసింది. ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేసిన సామాజిక సేవను గుర్తించి తనకు డాక్టరేట్ అవార్డు అందజేసినట్లు తిమ్మయ్య తెలిపారు. ఈ అవార్డుతో తన బాధ్యత మరింత పెరిగిందని,

జిన్నారం వాసికి డాక్టరేట్

మరికల్: మండలంలోని జిన్నారానికి చెందిన నంగి దేవేందర్‌రెడ్డి అందించిన సేవలకు గుర్తింపుగా డాక్టరేట్ అవార్డు వరించింది. శుక్రవారం హైదరాబాద్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో డాక్టరేట్ ఆఫ్ సోషల్ సర్వీస్ (స్పెషలైజేషన్ ఇన్ ఎన్‌ఆర్‌ఐ అఫైర్స్) విభాగంలో అమెరికాకు చెందిన గ్లోబల్ హ్యూమన్ పీస్ ఇంటర్నేషనల్ యూనివర్సిటీ దేవేందర్ రెడ్డికి డాక్టరేట్ పట్టాతో సత్కరించింది. తమ గ్రామానికి చెందిన దేవేందర్ రెడ్డికి డాక్టరేట్ రావడంతో గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు.

పూడిక తీతతో రైతులకు మేలు

ధన్వాడ: ధన్వాడ పెద్ద చెరువు నుంచి ఒండ్రు మట్టి తరలించడం ద్వారా చెరువులోతు పెరిగి నీటి నిలువ పెరుగుతుందని ధన్వాడ పెద్ద చెరువు కింద ఉన్న రైతులు అన్నారు. శనివారం ధన్వాడలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ చెరువు నుంచి మట్టిని తరలించడంపై కొందరు దుష్ప్రచారం చేయడంపై వారు స్పందించారు. చెరువు ఇప్పటికే దాదాపు 3 ఫీట్ల మేర మట్టితో నిండిపోయిందని దీంతో నీటి నిలువ తగ్గి ఎండాకాలం మొదటిలోనే చెరువు ఎండిపోయిందన్నారు. ఇప్పుడు ఒండ్రు మట్టి తీయడంతో చెరువులో నీరు నిల్వ సామర్థ్యం పెరిగే అవకాశం ఉందన్నారు. కొంత మంది తమ రాజకీయాల లబ్ధికోసం తప్పుడు ప్రచారం చేయడం ఆపేయాలని కోరారు.

నాగిరెడ్డిపల్లి లిఫ్ట్‌కు మరమ్మతు చేపట్టాలి

నర్వ: మండలంలోని నాగిరెడ్డిపల్లి ఎత్తిపోతల పథకంలో భాగంగా ఏర్పాటు చేసిన లిఫ్ట్‌కు మరమ్మతు చేయించాలని నాగిరెడ్డిపల్లి గ్రామస్తులు కోరారు. ఈ మేరకు శనివారం నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. మండలంలో ఇప్పటికే అనేక మంది రైతులు నాట్లు వేసి సాగు చేపట్టడంతో వర్షం లేక పంటలు ఎండుతున్నాయన్నారు. ఈ ఎత్తిపోతల పథకంలో మోటార్లను, పైప్‌లైన్లను, ట్రాన్స్‌ఫార్మర్‌లను మరమ్మతు చేయిస్తే రైతులకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. వినతిపత్రం అందించిన వారిలో పథకం కమిటీ సభ్యులు కావలి మహేష్, రాజేష్, కూర్మన్న, రాజు, రాంచంద్రి, పరమేష్, సత్యారెడ్డి తదితరులున్నారు.

బాలసదనం చిన్నారుల విహారయాత్ర

నారాయణపేట రూరల్: జిల్లా కేంద్రంలో బాల సదనంలోని అనాథ చిన్నారులు శనివారం విహారయాత్రకు వెళ్లారు. భీష్మరాజ్ ఫౌండేషన్ చైర్మన్ రాజ్ కుమార్ రెడ్డి సొంతంగా డబ్బులు కట్టి ఆర్టీసీ టూర్ ప్యాకేజీలో బస్సును బుక్ చేశారు. దీంతో విద్యార్థులు పసుపుల, దేవసుగుర్, మంత్రాలయం, పంచముఖి తదితర పుణ్యక్షేత్రాలు దర్శించనున్నారు. కార్యక్రమంలో సురేష్, హనుమంతు, ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

నారాయణపేట టౌన్: జిల్లా కేంద్రంలోని స్థానిక మినీ స్టేడియంలో జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి ట్రయాథ్లాన్ పోటీలలో మైనారిటీ గురుకుల పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు సత్తా చాటినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మహబూబ్ ఖాన్ తెలిపారు. అండర్–14 విభాగంలో విద్యార్థులు సత్తా చాటడంతో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. సత్తా చాటిన విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు. పీఈటీ భాను ప్రసాద్, ఉపాధ్యాయులు అబ్దుల్ అలీం, శివకుమార్ గౌడ్, జహంగీర్, హరీశ్, అపర్ణ పాల్గొన్నారు.

'షీ టీం' సేవలను వినియోగించుకోవాలి

నారాయణపేట రూరల్: మహిళలు, బాలికలు షీ టీం సేవలను వినియోగించుకోవాలని కానిస్టేబుల్ బాలరాజు అన్నారు. మండలంలోని సింగారం శివారులో సర్వే ట్రైనర్స్‌కు శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పని చేసే చోట ఎవరైనా ఈవ్ టీజింగ్‌కు పాల్పడినా, ప్రేమ పేరుతో వేధించినా షీ టీం పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. బస్సుల్లో ప్రయాణం చేసేటప్పుడు, బస్టాండ్‌లో పోకిరీలు ఎవరైనా అసభ్యంగా ప్రవర్తించినా, సైబర్ నేరాలకు పాల్పడుతున్నట్టు తెలిస్తే డయల్ 100కు సమాచారం ఇవ్వాలన్నారు. అలాగే ఎవరైనా సైబర్ నేరాలకు గురైతే టోల్ ఫ్రీ నెంబర్ 1930కు కాల్ చేసి సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో చెన్నయ్య, రాధిక, జ్యోతి, కవిత పాల్గొన్నారు.

'పేట'లో మెగా వైద్యశిబిరం

నారాయణపేట రూరల్: మండలంలోని కోటకొండ ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన మెగా వైద్యశిబిరం విజయవంతమైనట్లు వైద్యులు డాక్టర్ శృతి, డాక్టర్ ప్రతిభా భారతి తెలిపారు. వైద్యశిబిరానికి వచ్చిన అనేక మంది రోగులకు టీబీ వ్యాధులకు సంబంధించి ప్రత్యేక ఎక్స్‌రేలు తీసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అలాగే వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పారిశుద్ధ్య చర్యలను వివరించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ శ్రీధర్ ప్రసాద్, ఏఎన్‌ఎమ్ అనురాధ, దశరథ్, అంజమ్మ, కృష్ణవేణి, నరసమ్మ, కల్పన, వెంకటేశ్వరి, జయ, రేణుక పాల్గొన్నారు.